క్లుప్తంగా

నాగకోటి రెడ్డికి డాక్టరేట్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగ పరిశోధకుడు గాదె నాగకోటి రెడ్డికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి మంగళవారం తెలిపారు. ఫిజిక్స్ విభాగ పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య జి.నాగరాజు పర్యవేక్షణలో 'ద ఇన్‌ఫ్లూయెన్స్ ఆఫ్ సిల్వర్ అండ్ గోల్డ్ ఆయాన్స్ ఆన్ ద డైఎలక్ట్రిక్ డిస్పెర్షన్ డైనమిక్స్ ఆఫ్ జింక్ సెలీనియం ఫాస్ఫేట్ గాలస్ సెరామిక్స్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను నాగకోటి రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వివరించారు. నరసరావుపేట శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి డిగ్రీ కాలేజీలో నాగకోటి రెడ్డి అధ్యాపకునిగా పనిచేస్తున్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: అహ్మద్‌నగర్‌లోని నగరపాలకసంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ డీఐ షేక్ మొహమ్మద్ ఖాసిం మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థుల్లో సమ్మెటివ్ మార్కులను నిర్దేశిత సమయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై ఉపాధ్యాయులను అభినందించారు.

జగనన్న విద్యాజ్యోతితో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి సబ్జెక్టుల బోధనలో నిపుణులైన ఉపాధ్యాయులతో రూపొందించిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని అధిక మార్కులను సాధించాలని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.వి జయలక్ష్మి పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం టెన్త్ విద్యార్థినులకు జెడ్పీ ముద్రించిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేట్ చిష్టీ, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

ఘనంగా కాపు సమ్మేళనం



పాతగుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజంలో కాపు నాడు గుంటూరు పార్లమెంటరీ అధ్యక్షుడు మిరియాల గోపికుమార్ ఆధ్వర్యంలో కాపు సమ్మేళనం నిర్వహించారు. సభకు జాతీయ అధ్యక్షుడు జి.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకరరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా పల్నాడు జిల్లా కాపునాడు అధ్యక్షుడిగా అమరావతికి చెందిన పోలిశెట్టి సత్యనారాయణను నియమించి నియామక పత్రం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బొందలపాటి వెంకట్రావు, అడపా మాణిక్యాలరావు, మిరియాల ప్రసాదరావు పాల్గొన్నారు.

జిల్లా ఏఆర్ డీఎస్పీకి సత్కారం




నగరంపాలెం: జిల్లా ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్‌రావు సుమారు మూడేళ్లు సమర్థంగా విధులు నిర్వహించారని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. ఏలూరు జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్ రావుకు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సభలో సత్కరించారు. జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ (పరిపాలన) మాట్లాడుతూ కోవిడ్-19 వేళల్లోనూ పోలీస్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి నిర్వహణ కేటాయింపులోనూ సమర్థంగా పనిచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ కె.కోటేశ్వరరావు, ఆర్ఐలు రాజారావు, రమేష్‌కృష్ణన్, రాఘవయ్య పాల్గొన్నారు.


జంక్‌ఫుడ్స్‌తో జరభద్రం

గుంటూరు శ్రీనగర్‌కు చెందిన గాయత్రి ఇంటర్ చదువుతోంది. కొంతకాలంగా కళాశాల క్యాంటీన్‌లో ఫాస్ట్‌ఫుడ్స్ తింటూ ఇంటి భోజనం పక్కన పడేసింది. ఇటీవల కాలంలో రక్తపు విరోచనాలు అవడంతో చికిత్స కోసం జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించింది. వైద్యులు పరీక్షలు చేసి ఫాస్ట్‌ఫుడ్స్ కారణంగా నిర్ధారించారు చికిత్స చేశారు.

గుంటూరు బ్రాడీపేటకు చెందిన పదో తరగతి విద్యార్థి శ్రీనివాస్. పరీక్షల సమయంలో తీవ్రమైన కడుపునొప్పి సమస్యతో గుంటూరు జీజీహెచ్‌కు వచ్చాడు. పరీక్షల ఒత్తిడి వలన ఆహారం సక్రమంగా తీసుకోవటం లేదని తేలింది. విద్యార్థినికి, తల్లిదండ్రులకు గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు కౌన్సెలింగ్ ఇచ్చారు. సకాలంలో సరైన ఆహారం తీసుకోవాలని సూచించారు.

- పొంచిఉన్న జబ్బులు
- చిన్న వయసులోనే గ్యాస్ట్రబుల్ సమస్యలు





గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతున్న చిన్నారి దృశ్యం

గుంటూరు మెడికల్: జీవన శైలి మారింది. ఉదయం నుంచే ఉరుకులు పరుగులు.. అల్పాహారం నుంచి కూరల వరకు హోటల్స్‌పై ఆధారం పడాల్సి వస్తోంది. దీనికి తోడు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చిన జంక్‌ఫుడ్ బాగా ఆకర్షిస్తున్నాయి. పిల్లలకు చిరుతిళ్లపై ఉన్న ఇష్టం మాటల్లో చెప్పలేనిది. స్కూల్‌కు వెళ్లాలంటే ఏదో ఒకటి కొనిపిస్తే తప్పా బడికి వెళ్లమని మారం చేస్తారు. ఇంటర్‌వెల్ సమయంలో తప్పనిసరిగా చిరుతిండ్లు కొనుక్కునేందుకు డబ్బు లు ఇవ్వాల్సిందే. కంప్యూటర్ కాలంలో పిల్లల చిరు తిళ్లు మారిపోయాయి. ఒకప్పుడు చాక్లెట్, బిస్కెట్, వేరుశనగ ఉండలు, జీడీలు, పుల్ల ఐస్‌తోపాటుగా జామ, రేగిపండు లాంటి సీజనల్ పండ్లు పిల్లలను తినేవారు. పాఠశాలల వద్ద పిల్లల తినుబండారాలు అమ్మే దుకాణాల్లో ఇవి అమ్మేవారు. నేడు పరిస్థితి మారిపోయింది. రంగుల రంగుల ప్యాకెట్స్‌లో జంక్‌ఫుడ్స్‌ను దండలుగా వేలాడిదీసి పిల్లలను ఆకర్షించేలా షాపుల వద్ద పెడుతున్నారు. రంగుల ప్యాకెట్ల తో తియ్యటి విషం ఉంటుందని, వాటిని తింటే రోగాలు వస్తాయని తెలియక చిన్నారులు వాటిని తిని వ్యాధుల బారిన పడుతున్నారు. శ్రద్ధ చూపించనిపక్షంలో తీవ్ర అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఐదేళ్ల నుంచి 17 ఏళ్లలోపు వారు ఫాస్ట్‌ఫుడ్ తిని వివిధ రకాల అనారోగ్య సమస్యలతో గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగంలో చికిత్స పొందారు.

జిల్లాలో వెయ్యికిపైగా షాపులు...

జిల్లాలో చిరుతిళ్ల విక్రయాలు చేసే దుకాణాలు వెయ్యిపైగా ఉన్నాయి. తయారీ దుకాణాలు వంద వరకు ఉన్నాయి. కేవలం ఒక్క గుంటూరు నగరంలోనే 40 హోల్‌సేల్ షాపులు ఉండగా రిటైల్‌షాపులు వంద వరకు ఉన్నాయి. వీటిల్లో ఫుడ్‌సేఫ్టీ కంట్రోల్ అధికారుల వద్ద అనుమతులు తీసుకుని నిబంధనల ప్రకారం విక్రయాలు చేసేవారి సంఖ్య స్వల్పం. కొందరు వ్యాపారులు అధిక లాభాల కోసం నాసిరకం బియ్యం, గోధుమ, మైదా, శనగ పిండి, పామాయిల్‌తో ఇళ్లలోనే చిరుతిళ్లు తయారు చేస్తూ నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. ఇలాంటి ఆహారం తినడం ద్వారా పిల్లలు చిన్న వయసులోనే గ్యాస్ సంబంధిత సమస్యలతో వైద్యులను సంప్రదిస్తున్నారు.

లక్షణాలు
- తేన్పులు ఎక్కువగా రావడం
- అల్సర్లు ఏర్పడడం
- నీళ్ల విరేచనాలు
- రక్తపు విరేచనాలు

బాధితుల వివరాలు

గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స
- 2021లో 480 మంది
- 2022లో 744 మంది
- 2023లో 900 మంది

చిన్న వయస్సులో వ్యాధులకు కారణాలు

పిల్లలు ఎక్కువగా పిజ్జా, బర్గర్లు, న్యూడిల్స్, కుర్‌కురేలు వంటి ఫాస్ట్‌ఫుడ్స్ తినడం వల్లల పిల్లల శరీరాల్లో చెడు కొలెస్ట్రాల్ పెరిగిపోయి వ్యాధుల బారిన పడుతున్నారు. పాఠశాలల్లో ఇళ్ల వద్ద వారికి వ్యాయామం లేకపోవడం, చదువుల ర్యాంకుల కోసం పిల్లలపై విపరీతమైన ఒత్తిడి చేయడం, పరీక్షలంటే పిల్లల్లో తీవ్ర ఆందోళన ఉండటం వల్ల గ్యాస్ సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. ఐదేళ్ల నుంచి 17 ఏళ్ల మధ్య వారు ఎక్కువగా వ్యాధుల బారిన పడుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..



జంక్‌ఫుడ్స్ వలన పిల్లల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఎక్కువగా జీర్ణకోశ బాధితులు అవుతున్నారు. ఎక్కువ సార్లు కాచిన వంట నూనె వాడటం ఒక కారణం. వీటితో పిల్లల చిరుతిండ్లు తయారు చేయటం ప్రమాదంగా మారింది. బాల్యంలోనే స్థూలకాయం బారిన పడుతున్నారు. ఒక్కసారి తింటే వారానికి సరిపడా ఉప్పు పిల్లల శరీరంలోకి వెళ్లిపోతుంది. చిన్నవయసులోనే బీపీ, షుగర్‌లకు కూడా జంక్‌ఫుడ్సే కారణం. రక్తహీనత, పోషకాహారలోపం ఏర్పడతాయి. –డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, జీజీహెచ్, గుంటూరు

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా

పట్నంబజారు: పలు సమస్యలతో వైద్య చికిత్స పొందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా బాధితులకు అందజేశారు. రూ.7.35 లక్షలకు సంబంధించి చెక్కులు బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో అందించారు.

క్రైస్తవుల శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

నెహ్రూ నగర్: గుంటూరు నగర పరిధిలో క్రైస్తవులకు సంబంధించిన శ్మశాన వాటిక (సమాధుల తోట) పూర్తిగా నిండిపోయిందని ప్రభుత్వం స్పందించి క్రైస్తవుల శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఏసుబాబు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. క్రైస్తవులు ఎవరైనా చనిపోతే స్థలం లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సుబ్బయ్య, రమణ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

పట్నంబజారు: నివాసంలో పేకాటాడుతున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. శీలంవారి వీధిలో ఓ నివాసంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.33,300, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

గుంటూరు ఈస్ట్: బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. రాజీవ్‌గాంధీనగర్‌లో నివాసం ఉండే ఓ కుటుంబానికి చెందిన 15 సంవత్సరాల బాలిక సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పొన్నూరు: నిడుబ్రోలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు పాల్గొని విద్యార్థులకు గుంటూరు జిల్లా పరిషత్ వారు పంపించిన స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శివలక్ష్మీ, పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు పఠాన్ జాహెద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పొన్నూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మంగళవారం మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ చుండూరు వీరయ్య పాల్గొని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు వివరించారు. డ్రోన్ ద్వారా వ్యవసాయం చేసే విధానాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, అంగన్‌వాడి సూపర్‌వైజర్ ప్రేమలత, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం

గుంటూరు రూరల్: ప్రముఖ పౌరాణికులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో గుడిబడి సేవ, అనాథలకు అన్నదానం నిర్వహించారు. పద్మాకర్ శిష్య బృందం చేసిన సేవా కార్యక్రమాల్లో భాగంగా అమ్మ చారిటీ ద్వారా అనాథలు 850 మందికి అన్నదానం చేశారు.

ఓటరు తుది జాబితా సిద్ధం

- కమిషనర్ కీర్తి చేకూరి
- ఈనెల 22వ తేదీన విడుదల
- రాజకీయ పార్టీల నాయకులతో సమావేశంలో వెల్లడి



మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఓటరు తుది జాబితా ఈనెల 22వ తేదీన విడుదల చేయనున్నట్లు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్- 2024 పై ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ తాజాగా విడుదల చేసిన రీ షెడ్యూల్ మేరకు డిసెంబర్ 9 వరకు అందిన ఫిర్యాదులు, అభ్యంతరాలను జనవరి 12 లోపు క్షేత్ర స్థాయి విచారణ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నెల 12 లోపు డ్రాఫ్ట్ రోల్‌పై అందిన ఫిర్యాదులు, అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయడానికి బీఎల్‌ఓలకు యాక్షన్ ప్లాన్ ఇచ్చామని పేర్కొన్నారు. నూతనంగా ఫారం-6 ద్వారా ఓటు దరఖాస్తు చేసే వారు సరైన ధ్రువ పత్రాలు ఇవ్వకుంటే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, క్షేత్ర స్థాయి పరిశీలనకు బీఎల్‌ఓలకు పంపాలని ఆదేశించారు. పీఎస్‌ఈ (ఫొటో సిమిలర్ ఎంట్రీలు)/డీఎస్‌ఈ (డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీలు) ఉన్న ఓటర్లకు ఫార్మెట్-ఏ ద్వారా రిజిస్టర్ పోస్ట్ చేశామని, ఓటర్లు తమ ఓటు ఎక్కడ ఉంచాలో/తొలగించాలో కన్ఫర్మేషన్ లెటర్ ద్వారా తెలియజేయాలని సూచించారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీశివ జ్యోతి, ఏఈఆర్‌ఓ బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు సాంబశివరావు, పద్మ, టీడీపీ, బీఎస్పీ, బీజేపీ, ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్ నుంచి ఓంకార్, సిహెచ్.వాసు, ఆర్.భాస్కరరావు, సేవకుమార్, జాని బాషా పాల్గొన్నారు.

క్రీడలు చదువులో అంతర్భాగం కావాలి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



బాస్కెట్‌బాల్ ఫ్లడ్ లైటింగ్ వ్యవస్థను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, పక్కన శివాజీ, విష్ణువర్ధన్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాసంస్థల్లో క్రీడలు చదువులో అంతర్భాగంగా అమలు చేయాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నూతనంగా నిర్మించిన బాస్కెట్ బాల్ కోర్టు ఫ్లడ్ లైటింగ్ వ్యవస్థను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏ పనైనా ప్రారంభించే ముందు సరైన ప్రణాళికతో ఆచరణాత్మకంగా అమలు చేయడం ద్వారా విజయం సాధించి, ఉన్నతస్థాయికి చేరుకోవచ్చునని అన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి, మెరుగైన క్రీడాకారులుగా ఎదిగి, జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపాలని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన నైపుణ్యాలను వెలికితీయడమే క్రీడల లక్ష్యమని చెప్పారు. విద్యార్థులను అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఆధునికంగా తీర్చిదిద్దిన బాస్కెట్ బాల్ కోర్టును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, హెచ్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి గుంటుపల్లి హరగోపాల్, బాస్కెట్‌బాల్ కోచ్‌లు రవి, నాగ తులసి పాల్గొన్నారు.

రజక సేవా సంఘం సమస్య పరిష్కారం



నూరిఫాతిమాకు వినతిపత్రం అందజేస్తున్న రజక సేవాసంఘం సభ్యులు

పట్నంబజారు: గుంటూరు రజక సేవాసంఘంకు సంబంధించి 13 ఏళ్లుగా ఉన్న వివాదం కొలిక్కి వచ్చింది. తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చొరవతో ఇరువర్గాలు అంగీకరించాయి. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం నూరిఫాతిమా ఇరువర్గాలతో చర్చలు జరిపారు. ఈనేపథ్యంలో సంఘానికి సంబంధించి పూర్తి స్థాయి వివరాలు తెలుసుకుని ఇకపై వివాదాలు లేకుండా కలసిమెలిసి ఉండాలని కోరారు. సంఘానికి ఎటువంటి సాయం అవసరమైన ఎమ్మెల్యే ముస్తఫా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇరువర్గాల అంగీకారంతో ఒప్పందం కుదిరింది. కార్యక్రమంలో ఎనిమిదో డివిజన్ కార్పొరేటర్ ఇర్రి ధనలక్ష్మి, సాయి, రజక సేవాసంఘం సభ్యులు ఉమామహేశ్వరరావు, కె.పాపారావు, శ్రీనివాసరావు, గుంటూరు నరసింహారావు, వి.శ్రీనివాసరావు, ఎం.ప్రసాద్, ఎం.శివప్రసాద్, ఎం.ఉమాకాంతరావు, రాచకొండ లక్ష్మణ్, ఎస్.అశోక్, లింగాల మణికంట, వి.రాజేష్ పాల్గొన్నారు.

కాపుల ఆత్మీయ సమావేశం వెనుక ఏ రాజకీయ పార్టీ లేదు..

కాపు జేఏసీ కన్వీనర్ దాసరి రాము



మాట్లాడుతున్న దాసరి రాము

పాత గుంటూరు: కాపుల ఆత్మీయ సమావేశం వెనుక ఏ రాజకీయ పార్టీ లేదని కాపు జేఏసీ కన్వీనర్ దాసరి రాము పేర్కొన్నారు. అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాపులను రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. గుంటూరు జిల్లాలో కాపులు ఐక్యంగా ఉండి జనాభా ప్రాతిపదికన సీట్లు సాధించుకునేందుకు గత నెల 30న విజ్ఞాన మందిరంలో నిర్వహించిన కాపుల ఆత్మీయ సమావేశంలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అహంకార పూరితంగా మాట్లాడటాన్ని ఖండించారు. కాపు నాయకుడు అని ఆహ్వానిస్తే పెద్దలను అగౌరవ పరిచి సభను అవమాన పరిచే విధంగా ప్రవర్తించాడని మండిపడ్డారు. ఐక్యత కోసం అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కాపులతో నిర్వహించిన సభలో కాపులను రెచ్చగొట్టే విధంగా గాదె వెంకటేశ్వరరావు మాట్లాడిన విధానం సరికాదని చెప్పారు. కాపు ఉద్యమ నాయకులను కించ పరిచే విధంగా వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు. ఓ వ్యక్తి మాట్లాడిన మాటలను పచ్చ మీడియా కావాలనే ఒక రాజకీయ పార్టీ కి అమ్ముడు పోయారని చూపించడం దుర్మార్గమన్నారు. మాకు రావాల్సిన హక్కుల కోసం ఏర్పాటు చేసుకున్న సమావేశాన్ని వక్రీకరించి ఛానల్స్‌లో ప్రసారం చేయడం దారుణం అన్నారు. ఏలూరు ప్రసాద్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు సభలో పాల్గొన్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే, పెద్దలను అగౌరవపరిచే విధంగా మాట్లాడటాన్ని సిగ్గుమాలిన చర్యగా పరిగణించారు. మహోన్నత వ్యక్తి వంగవీటి మోహన్ రంగా గురించి చులకనగా మాట్లాడి రాజకీయాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బొక్కిసమ్ శివరామ్ మాట్లాడుతూ అవినీతి రాజకీయాలను ప్రోత్సహిస్తున్న కొందరు నేతలను తమ పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



వలంటీర్లను అభినందిస్తున్న వీసీ రాజశేఖర్, రెక్టర్ వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ కరుణ తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) వలంటీర్లు ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈటా నగర్‌లో నిర్వహించనున్న జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొంటారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ డి.రవి శంకర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ శిబిరంలో 15 రాష్ట్రాల నుంచి వలంటీర్లు పాల్గొంటున్నట్లు చెప్పారు. అందులో విద్య, సంస్కృతి సంప్రదాయాలు, ఆర్థిక, భాషాపరమైన అంశాల్లో పోటీపడతారని వివరించారు. శిబిరానికి హాజరయ్యే వర్సిటీ జట్టుకు ఎస్.కె. మొహమ్మద్ బాషా నాయకత్వం వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వలంటీర్లను ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థుల్లో చదువుతోపాటు సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన, ఆర్థిక, భాషాపరమైన అంశాలలో రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరానికి వలంటీర్లు ఎం.హాజస, బి.ఐశ్వర్య, ఎం.శిరీష, పీవీఎన్ భార్గవి, బి.దేవిక, డి.సంతోష్ కుమార్, బి.మొహమ్మద్ హుస్సేన్, సిహెచ్.సాత్విక్, ఏ గణేష్, జి.వంశీ ఉన్నారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ తదితరులు వలంటీర్లను అభినందించారు.

ఆప్షన్-3 లబ్ధిదారులు జియో ట్యాగింగ్ చేయించుకోవాలి

హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్

నెహ్రూ నగర్: జగనన్న కాలనీలో ఆప్షన్ 3 కింద ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు నేడు, రేపు(స్టేజ్ అప్‌డేషన్ డ్రైవ్) లే ఔట్లలో అందుబాటులో ఉండి ఫేస్ ఆథెంటికేషన్ జియో ట్యాగింగ్ చేయించుకోవాలని హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. లేఅవుట్లలో ఆప్షన్ 3 (కాంట్రాక్టర్లతో కట్టించుకునే ఇల్లు) కింద ఇల్లు నిర్మించుకుంటున్న వారు తప్పనిసరిగా సదరు లేఔట్లలో ఫేస్ ఆథెంటికేషన్ జియో ట్యాగింగ్ చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో లబ్ధిదారులు తప్పనిసరిగా 3,4 తేదీల్లో లేఔట్లలో అందుబాటులో ఉండాలని కోరారు. ఇప్పటికే హౌసింగ్, వార్డ్ ఏమినిటీ సెక్రటరీలు లబ్ధిదారులకు సమాచారం అందించినట్లు వివరించారు. వారం రోజులు లోపు ఆగిపోయిన బిల్లులు మంజూరు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారన్నారు. ఆప్షన్ 3 కింద బిల్లులు ప్రాసెసింగ్ కోసం ఆన్లైన్ లో కాంట్రాక్టర్ల ద్వారా నమోదు చేయబడిన సుమారు 620 మంది లబ్ధిదారులకు సంబంధించిన బిల్లులు చెల్లింపులో ఆలస్యం జరిగిందని, ఫేస్ ఆథెంటికేషన్ అయిపోయిన వెంటనే ఆగిపోయిన బిల్లులు మంజూరు అవుతాయని చెప్పారు. లబ్ధిదారులు హౌసింగ్, వార్డు ఎమినిటీ సెక్రటరీలకు సహకరించి జియో ట్యాగింగ్ చేయించుకోవాలని కోరారు.

అండర్ ఆర్మ్ క్రికెట్ టోర్నీలో లోటస్ సత్తా



విద్యార్థులతో వెంకటేశ్వరరావు, ఝాన్సీరాణి

గుంటూరు ఎడ్యుకేషన్: అండర్ ఆర్మ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గత వారం రాజస్థాన్‌లోని జేజేటీ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన అఖిల భారత 11వ అండర్ ఆర్మ్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో లోటస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల డైరెక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు తెలిపారు. కృష్ణనగర్‌లోని పాఠశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అండర్-16 నేషనల్ చాంపియన్‌షిప్ అండ్ ఫెడరేషన్ కప్-2023లో విద్యార్థులు జి.నిఖిల్ శ్రీనివాస్, డి.జ్ఞానదీప్ ప్లేయర్ ఆఫ్ బెస్ట్ టీం, బెస్ట్ బౌలర్‌గా నిలిచి ప్రథమ బహుమతితో పాటు విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సి.ఝాన్సీరాణి, కోచ్‌లు డి.పవన్ చక్రి, ఉపాధ్యాయులు అప్పారావు, సుమన్, రాజేష్ పాల్గొన్నారు.

విద్యావేత్త శ్రీమన్నారాయణకు సత్కారం



శ్రీమన్నారాయణను సత్కరిస్తున్న కన్నా మాస్టారు, కొండా శివరామిరెడ్డి

లక్ష్మీపురం: వేలాది మంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన శాంతా కాలేజీ శ్రీమన్నారాయణను ప్రైవేటు విద్యాసంస్థలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం శాంతాకాలేజీ శ్రీమన్నారాయణను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. డాక్టర్ కన్నా మాస్టారు మాట్లాడుతూ గుంటూరు విద్యా కేంద్రంగా అభివృద్ధికి శ్రీమన్నారాయణ అని కొనియాడారు. ఈయన వద్ద విద్యనభ్యసించిన పలువురు విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడ్డారని కొనియాడారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకొచ్చిన శ్రీమన్నారాయణ అభినందనీయులన్నారు. ఈసందర్భంగా శ్రీమన్నారాయణను సంస్థ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పి.ఎస్.మూర్తి, జయకుమార్ పాల్గొన్నారు.